వుత్తరం వచ్చింది. వచ్చి వారంరోజులు కాలేదు యేమిటా అనుకొంటూ కంగారుగా వాళ్ల ఇంటికి వెళ్లేసరికి ఆమె వొకటే మండిపడుతూంది. 'మద్రాసు పోగానే బుద్ధులు మారుతుంటాయ్! —అందుకే కాబోలు వుత్తరాలు రీ డైరక్టు చేయమన్నావ్!— 'అయినాగాని రాము నీవిలా తయారవుతావ్ అనుకోలేదు!'—ఇలా డొంకతిరుగుడుగా తిట్టి 'ఈరాధ ఎవరో చెప్పు!' అంటూ ఓ ఉత్తరం నా మొహాన కొట్టింది. ప్రియమైన రామూ—నీవు వుత్తరాలు ఎందుగ్గాను వ్రాయటం నిలిపివేసావు? నీ జాబులు రాకుంటే నాకేమి తోచదు. దీనికైన జవాబు వ్రాయ్—నీ ప్రియమైన రాధ'. అది నామిత్రుడు రాధాకృష్ణ వ్రాసింది! చదువుమీద అతన్ని 'రాధా' అని పిలుస్తాను అని చెప్పగానే అత్తయ్య ఒక్క నవ్వు నవ్వి 'అయితే నీకు మొగప్రియురాండ్లు కూడ వున్నారన్నమాట!' అంది. రాము.

* * *

# గృహ బడ్జట్

ఈమధ్యరాష్ట్ర, కేంద్రప్రభుత్వబడ్జట్ల గురించి పేపర్లలో చదివింతర్వాత నేనూ వచ్చేనెల గృహబడ్జట్ తయారుచెయ్యాలనుకుని ఫస్టుతారీకు జీతం 125 రూపాయలు చేతిలోపడగానే ఇంటికి వెళ్లి సావకాశంగాకూర్చున్నా బడ్జట్‌తయారుచేసేనిమిత్తం. మా ఆవిడ సహకారం కూడా వుంటే మరీ బాగుంటుందని నెమ్మదిగా పిలిచి నా ఉద్దేశ్యం తెలియపరిచా. మొదట్లో "అన్నీ అనుకున్నట్లు జరిగాయి కనుక ఇదొక్కటే జరగటానికి" అన్నది గాని చివరికి బలవంతంమీద నాతో పూర్తిగా సహకరించడాని కంగీకరించింది. ప్రధమంగా తప్పని సరిఅయిన విషయాలు తీసుకున్నాం. అంటే ఇంటి అద్దె 30 రూపాయలు, కాఫీ ఖర్చు 20 రూపాయలు. ఇక మిగిలిన 75 లో ఇంట్లోవాడటానికి 50 రూ॥ కేటాయిస్తే బాగుంటుందని ప్రతిపాదించా. కాని అది చాలా చిన్న మొత్తమని, ప్రతినెలా 60 రూ॥ కూడా సరిగా సరిపోవటం లేదని మా ఆవిడ అప్పోజ్ (Oppose) చేయటం మూలాన, ఇంటి ఖర్చుక్రింద 60 రూ॥ నిర్ణయించాం. నాకు చేతిలోకి 15 రూపాయలన్నా లేందే కష్టమన్నా.

"ఆ మిగిలిన 15 మీరే తీసుకుంటే మరి నాకు చేతిలోకో" అంది మాఆవిడ.

"ఇంట్లో వాడటానికి కేటాయించిన మొత్తంలో నీ యిష్టమొచ్చినంత మిగుల్చుకో" అన్నా నవ్వుతూ.

"అసలింట్లోకొకటిసరిగ్గా సరిపోతేగా" అంది.

"వారాని కొరోజు భోజనం మానేస్తే ప్రభుత్వంతో పూర్తిగా సహకరించినట్టూ వుంటుంది. మనకూ కొంతమిగుల్తుంది" అన్నా.

"బాగా చెప్పారు. భోజనం మానేస్తే దాని బదులు పండో ఫలమో తినకుండా వుండగలమా! ఏమిటి. దానికీ బోలెడం తవుతుంది" అంది మాఆవిడ.

మా ఆవిడ చేతిఖర్చుకి నాలుగైదు రూపాయలూ ఎట్లా రాబట్టాలా అని రెండు గంటల సేపు సుదీర్ఘ చర్చ సాగించి చివరికి కాఫీ క్వాలిటీ కన్న క్వాంటిటీ కొంచం తగ్గించినందువల్ల లోటుభర్తీ చేయవచ్చునని నిర్ణయించి బడ్జట్ పూర్తయిందనిపించాం.

పట్టుమని పదినిమిషాలైనా కాలేదు.

"పండక్కి తీసుకున్న చీరెలబాపతు పాతికరూపాయలు ఇప్పిస్తారాపంతులుగారూ" అంటూ కాతాదారు రాజయ్య వచ్చాడు.

"నిజమే దానివిషయమే మర్చిపోయాం మనిద్దరం" అన్నా ఆశ్చర్యముగా. "అయినా మీచేదస్తం గాని పులినిజూసి నక్క వాతలుపెట్టుకుందిట. ప్రభుత్వానికీ మనకీ సాపత్యం ఎక్కడండీ బడ్జట్ తయారుచెయ్యడానికి" అంది మా ఆవిడ.

బొమ్మకంటి రామారావు.

# అత్తయ్యా సరసం

"ఒరే అబ్బాయి" అని పిలిచింది వెంకమ్మ వీధి గడపమీద చదువుతున్న మేనల్లుడ్ని.

"ఆ వస్తున్నా! వస్తున్నా!" పుస్తకం గూట్లో గిరాటువేసి చక్కా వచ్చాడు.

"నీకు జోశ్యంచెబుతా? నాకేమిస్తావ్ నిజమైతే."

"ఆఁ ఎప్పుడూ ఇంతే! నేను మొన్న కొన్న కొత్త గాలిపటం యిస్తా. ఈ వూళ్ళో ఎవ్వరికీ లేదు."

"నాకెందుకురా అవి తలకాయ తగలేసేందుకు."

"నీకేం తెలీదు. నువ్వు తలపోతుకున్నా యిల్లాంటి గాలిపటం దొరుకుతుందా? దీని విలువ నీకేం తెలుస్తుంది! చెప్పవే అత్తా విషయం!"

"బలే! నీకు ఓ చిన్న బంగారు అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తారు!"

"అల్లానా! పెళ్ళా! నాకు వద్దు బాబూ!

నిన్ను మేష్టారు కొట్టినట్టు బాదరురా! నీకు పసుపురాసి, తలంటి నీళ్లుపోసి కొత్తబట్టలు కట్టించి, సవ్వారీపైన ఊరేగించి యింకా ఎన్నో చేస్తారు.

అబ్బా...నాకొద్దు పసుపు. అంతా నవ్వుతారు.

కాదురా! పిండివంటలు వండుతారు. మిఠాయి చేస్తారు యిస్తారు.

అన్నీ నాకు యిచ్చేస్తారా!

అన్నీ మనకే! గంపలు చేసిపంపుతారు. వాటిని గందులోదాచి ప్రతీరోజు కొంచం...కొంచం...నీకు ఉంగరం యిస్తారు...కట్నం ఇస్తారు.

ఏకట్నమె! అత్తయ్యా.

"వెయ్యి రూపాయలు!"

అయితే చూడు. "నిజం" మోటారు కొంటాను. నిన్ను ఎక్కించుతాలే.

అవే చూడు! మొదట్లో బెదిరావు. ఎంత బాగుంటుందో పెళ్లి.

పెళ్లి బాగుందిగాని ఒడుగులా పంచశిఖలు పెట్టి బుర్ర గొరగరు కదా!

వెధవా! నీకేం పొయ్యేకాలం, శుభమల్లే పెళ్లిగురించి చెబుతే, అపశకునం మాటలేమిటిరా అంటూ లేచిపోయింది.

బులుసు సోమయాజులు,